# సంఘద్రోహి

కొంతమంది ప్రబుద్ధుల్ని చూస్తుంటాము. ఏ పనీ చెయ్యరు. ఖాళీగా కాలం గడిపేయడమో, బలాదూర్‌గా తిరగడమో చేస్తుంటారు. ఏ పనీ లేకుండా ఒక్క క్షణం గడపడం చాలా కష్టమైన పని ఎవరికైనా. అలాంటిది వీళ్ళలా అంత నిరర్ధకంగా కాలం గడిపేస్తారో అర్థం కాదు.

కొంతమందిని చూస్తుంటాము. "నేను పనిచేయక పోవడమేమిటి ? ఒక్క క్షణం తీరిక ఉండదు నాకు" అంటుంటారు. ఇంతకీ వీళ్ళ దినచర్య ఏమిటంటే తెల్లవారు ఝామునే ఎనిమిదింటికి నిద్రలేస్తారు. టీవీలో కామెడీ బిట్లు, సినిమా పాటలు చూస్తూ రెండు గంటలు గడిపేస్తారు. ఆ తర్వాత న్యూస్ పేపరు తీసుకుని సరాసరి సినిమా సమాచారంలోకి వెళ్ళిపోయి ఏ హీరోయిన్ ఎవరితో ఎఫైర్‌లు పెట్టుకుంటోంది ? ఫలానా హీరో ఫలానా సినిమాలో ఎన్ని జతల బట్టలు మార్చాడు లాంటి ఉత్కంఠభరితమైన వార్తల్ని ఒక్క లైను వదలకుండా ఆసాంతం చదివేస్తారు. తర్వాత ఫోంచేసి క్లబ్‌కి వెళ్ళి సాయంత్ర వరకూ పేకాడుకుంటారు. అప్పుడప్పుడూ డబ్బులు వస్తుంటాయి. ఎప్పుడూ పోతుంటాయి. సాయంత్రం ఫస్ట్‌షో సినిమాకో,

మరి కొందరిని చూస్తుంటాము. "ఏడు తరాల పాటూ కూర్చుని తిన్నా తరగని ఆస్థి మాకుంది. ఏ పనైనా చేయాల్సిన ఖర్మ మాకేంటి ?" అంటుంటారు. ఇలాంటి వాళ్ళందరినీ సంఘద్రోహులుగా ముద్ర వేయాలి. ఎందుకంటే, తాతల నాటి ఆస్థుల్ని తింటూ సోమరిపోతుల్లా ఏపనీ చేయకుండా ఉండడం మిగిలిన వాళ్ళ కష్టాల్ని దోచుకు తినడమే.

పొద్దున్న లేవగానే న్యూస్‌పేపరు చదువుతారు. ఆ పేపరు ఎలా వచ్చింది ? కొంటే వచ్చిందని టక్కున చెప్పేస్తారు. నిజమే డబ్బులిస్తున్నాము. కొంటున్నాము. కానీ ఆ పేపరు తయారవడానికి ఎంత మంది ప్రెస్ కార్మికులు, జర్నలిస్టులు, ఎడిటర్‌లు, ప్రింటర్స్, ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు ? వాళ్ళందరూ రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తేనే కదా మనం పేపరు చదవ గలుగుతున్నాం ? వీళ్ళందరికీ కూడా తాత ముత్తాతల నాటి ఆస్థులు ఉండి పని చేయడం మానేసారే అనుకుందాం ? అప్పుడు మనం పేపర్ ఎలా చదవ గలుగుతాం ? ఎంత డబ్బిస్తే మాత్రం దొరుకుతుంది ?

సినిమాకి వెళ్ళాలంటే రిక్షామీదో, ఆటో మీదో వెళ్ళాలి. రిక్షావాలాలు, ఆటోవాళ్ళూ తమ తమ డ్యూటీ సక్రమంగా చేస్తేనే కదా మనం వాటి మీద ఎక్కడికైనా వెళ్ళగలిగేది ? వాళ్ళకి కూడా తాత ముత్తాతలనాటి ఆస్థి ఉండి పని చేయడం మానేస్తే వ ంనం అడుగు తీసి అడుగు వేయలేం.

అలాగే ఈ ప్రపంచంలో డబ్బిచ్చి కొనుక్కునే ఏ వస్తువుకి అయినా, ఏ సేవకి అయినా వెనుక ఎంతో మంది రెక్కల కష్టం ఉంది. మరెంతో మంది నిద్రలేని రాత్రులు ఉన్నాయి. వాళ్ళంతా డబ్బుకోసమే అయినా ఆ పనులు చేయకపోతే జనజీవనమే స్థంబించి పోతుంది.

వాళ్ళందరి సేవల్ని వినియోగించుకునే మనం తిరిగి వాళ్ళకోసం, అంటే సంఘం కోసం, ఏదో ఒక పని చేయాలి. అది అందరికీ పనికొచ్చే వస్తువే కావచ్చు, సేవే కావచ్చు, వినోద సాధనమే కావచ్చు. మన కష్టానికి తగ్గ ప్రతిఫలం ఆశించే అయ ంనా మనమూ పని చేయడం తప్పని సరి. ఎందుకంటే మానవుడు సంఘజీవి. ఒకరు చేసే పని మరొకరికి ఉపయోగ పడేలా ఆ విధంగా అందరికీ అన్ని సేవలు దొరికేలా ఈ సమాజాన్ని తీర్చి దిద్దడం జరిగింది. అందుకే కోట్ల ఆస్థి ఉంది కదాని కూర్చుని తినే వాడు – సంఘద్రోహి.

కాదని మీకనిపిస్తే ఎందుకు కాదో వివరిస్తూ మాకు వ్రాయండి